తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

శనివారం

02 మే 2026

సంపుటి 03


సంచిక 204

పేజీలు 8

వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com

## శాంతి, జ్ఞాన మార్గాన్ని ప్రపంచానికి చూపిన భారత్

- లడఖ్‌లో బుద్ధుని పవిత్ర అవశేషాల అంతర్జాతీయ ప్రదర్శన ప్రారంభం
- ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యం
- మానవాళి శ్రేయస్సు కోసం ముందడుగు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

లడఖ్, మే 1తరంగాలు ప్రతినిధి కేంద్ర హోం మంత్రి అమిత్ షా లడఖ్‌లో బుద్ధుని పవిత్ర అవశేషాల తొలి అంతర్జాతీయ ప్రదర్శన ప్రారంభమవడం విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుందని

➤ మిగతా 2వ పేజిలో..

# కార్మికులకు అండగా సీఎం చంద్రబాబు

- 15 లేబర్ అడ్డాల ఏర్పాటు ప్రకటన
- కార్మికుల కోసం ప్రత్యేక సదుపాయాలు
- స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం
- సంక్షేమ పథకాలపై కీలక వ్యాఖ్యలు



కృష్ణా జిల్లా, మే 1తరంగాలు ప్రతినిధి అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సంక్షేమానికి సంబంధించి కీలక ప్రకటన చేశారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలోని పమిడిముక్కలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కార్మికుల కోసం ప్రత్యేకంగా 15 ప్రాంతాల్లో 'లేబర్ అడ్డాలు' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు 'శ్రమ శక్తి' పురస్కారాలను అందజేసి సత్కరించారు. లేబర్ అడ్డాల ద్వారా కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. ఎండ, వానల నుంచి రక్షణతో పాటు విశ్రాంతి తీసుకునే సదుపాయాలు ఉండేలా నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. ఇవి కేవలం ఆశ్రయం మాత్రమే కాకుండా, కార్మికుల నైపుణ్యాన్ని పెంచే శిక్షణ కేంద్రాలుగా కూడా పనిచేస్తాయని వివరించారు. ఆధునిక పనిముట్లు అందించి, శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యమని చెప్పారు.

ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అసంఘటిత రంగానికి చెందిన సుమారు 88 లక్షల మంది కార్మికులకు మేలు జరుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికి కీలకమని, వారి జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తమ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో 62.47 లక్షల మందికి ప్రతినెలా పింఛన్లు అందిస్తున్నామని, గత 22

➤ మిగతా 2వ పేజిలో..

# పెండింగ్ చలాన్లపై వాహనాల సీజ్‌కు బ్రేక్..

- హైకోర్టు సీరియస్
- కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై నోటీసులు
- డీజీపీ సహా ఉన్నతాధికారులకు వివరణ కోరింపు
- జూన్ 19కి తదుపరి విచారణ



హైదరాబాద్, మే 1తరంగాలు ప్రతినిధి పెండింగ్ చలాన్లు ఉన్నాయనే కారణంతో వాహనాలను సీజ్ చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. గతంలో జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే పెండింగ్ చలాన్లు ఉన్నంత మాత్రాన వాహనాలను స్వాధీనం చేసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేసినప్పటికీ, పోలీసులు ఆదేశాలను పట్టించుకో వడం లేదని బాధితుడు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నా రని పిటిషనర్ ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు రాష్ట్ర డీజీపీ, హోం శాఖ

➤ మిగతా 2వ పేజిలో..

## సీఎంను కలిసిన డీజీపీ, భద్రతా సలహాదారు

- ఎంసీహెచ్‌ఆర్డీలో అధికారుల భేటీ
- భద్రతా వ్యవహారాలపై చర్చలు



హైదరాబాద్, మే 1తరంగాలు ప్రతినిధి రాష్ట్ర భద్రతా వ్యవహారాల సలహా దారుగా నియమితులైన బి. శివధర్ రెడ్డి, రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో ఈ భేటీ జరిగింది. రాష్ట్ర భద్రత, పోలీసింగ్‌కు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రితో చర్చలు జరిగినట్లు సమాచారం. కొత్త బాధ్యతల నేపథ్యంలో సమన్వయంతో పనిచేయాలని సూచనలు చేసినట్లు తెలిసింది. ఇటీవల బదిలీల నేపథ్యంలో వివిధ కీలక పదవుల్లో బాధ్యతలు స్వీకరించిన పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా ముఖ్యమంత్రిని

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ భవన్‌లో ఘనంగా మేడే వేడుకలు

➤ 2వ పేజిలో..



## తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు

- గౌరవ వందనంతో అధికారిక బాధ్యతలు ప్రారంభం
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో విశేష అనుభవం
- టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం

హైదరాబాద్, మే 1 తెలంగాణ రాష్ట్ర పోలీసు వ్యవస్థకు కీలక మలుపుగా భావించే పరిణామంలో సీవీ ఆనంద్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా

➤ మిగతా 2వ పేజిలో..

# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

- ఏపీలో రికార్డు, తెలంగాణలో హెచ్చరికలు
- పిడుగురాళ్లలో 45.9ళ ఉష్ణోగ్రత నమోదు
- తెలంగాణలో వడగాల్పులపై అలర్ట్
- రెండు రాష్ట్రాల్లో ప్రజలకు జాగ్రత్తల సూచనలు



అమరావతి/హైదరాబాద్, మే 1తరంగాలు ప్రతినిధి తెలుగు రాష్ట్రాల్లో సూర్యుడు తన ప్రతాపాన్ని తీవ్రంగా చూపిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో శుక్రవారం 45.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదై ఈ వేసవిలో అత్యధికంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవగా, 252 మండలాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత మరింత పెరగనుంది. శనివారం 64 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా పల్నాడు, పార్వతీపురం మన్యం, ప్రకాశం జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనుంది.

ఇక ఉత్తరాంధ్ర, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ద్రోణి ప్రభావంతో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం, సోమవారం కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొద్దిగా తగ్గి ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తెలంగాణలో కూడా ఎండల తీవ్రత కొనసాగుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 40 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు

➤ మిగతా 2వ పేజిలో..

# శాంతి, జ్ఞాన మార్గాన్ని ప్రపంచానికి చూపిన భారత్

➢ మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. ఈ కార్యక్రమం చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి, జ్ఞాన సందేశాలను గుర్తు చేసుకున్నారు. ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపడంలో భారతదేశం ఎప్పుడూ ముందుండేదని అమిత్ షా పేర్కొన్నారు. బుద్ధుని బోధనలు నేటికీ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు.భారత్ ప్రపంచానికి శాంతి, సహజీవన సూత్రాలను అందించిన దేశమని ఆయన అన్నారు. ఈ వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రపంచ శ్రేయస్సు కోసం కృషి చేయడం భారత లక్ష్యమని తెలిపారు. ఇటువంటి ప్రదర్శనలు భారత ఆధ్యాత్మిక సంపదను ప్రపంచానికి పరిచయం చేస్తాయని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ మళ్లీ శాంతి, జ్ఞాన మార్గాన్ని ప్రపంచానికి చూపిస్తున్నదని అమిత్ షా వ్యాఖ్యానించారు. మానవాళి అభ్యున్నతికి భారతదేశం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. లడఖ్‌లో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ ప్రదర్శన ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ భక్తులను ఆకర్షించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇది పర్యాటక రంగానికి కూడా ఊతమివ్వనుందని పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా బుద్ధుని బోధనలు మరింత విస్తృతంగా వ్యాప్తి చెందుతాయని, ప్రపంచ శాంతి కోసం భారతదేశం చేస్తున్న కృషి మరింత బలపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సీఎంను కలిసిన డీజీపీ, భద్రతా సలహాదారు

➢ మొదటి పేజీ తరువాయి

కలిశారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో తాజా మార్పులు, భద్రతా చర్యలపై సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో శిఖా గోయల్, డీఎస్ చౌహన్, షానవాజ్ ఖాసీం, తరుణ్ జోషి, బి. సుమతి పాల్గొన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడం, సాంకేతికత ఆధారంగా పోలీసింగ్‌ను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంపై అధికారులు చర్చించారు. ఈ భేటీతో తెలంగాణ పోలీస్ వ్యవస్థలో సమన్వయం, కార్యాచరణ మరింత బలపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. కొత్త బాధ్యతలు చేపట్టిన అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం.

## పెండింగ్ చలాన్లపై వాహనాల సీజ్‌కు బ్రేక్..

కార్యదర్శి, అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ వాహనాలను ఎందుకు సీజ్ చేస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అధికారుల వివరణను సమర్పించాలని కోర్టు సూచించింది. సమగ్ర నివేదికను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. చట్టబద్ధమైన ప్రక్రియలు పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేసింది.పెండింగ్ చలానాల విషయంలో పోలీసులు కేవలం జరిమానా వసూలు చేయాలే గానీ వాహనాలను సీజ్ చేసే అధికారం లేదని కోర్టు మరోసారి స్పష్టం చేసింది. ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన అవసరాన్ని హైలైట్ చేసింది. ఈ కేసు విచారణను జూన్ 19వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు అధికారుల నుంచి సమగ్ర వివరణను కోరింది. ఈ పరిణామంతో చలాన్ల విషయంలో స్పష్టత నెలకొనే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు

➢ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు స్వీకరించారు. ఈ రోజు ఉదయం డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు ఉన్నతాధికారులు సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి అధికారికంగా తన బాధ్యతలను చేపట్టారు. 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ పోలీసు సేవల్లో విశేష అనుభవం సంపాదించారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయన, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పనిచేసిన సమయంలో మావోయిస్టు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని శాంతిభద్రతలను కాపాడడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను అప్పట్లోనే విశేషంగా గుర్తించారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో నగర భద్రతలో సీవీ ఆనంద్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు పలు చర్యలు చేపట్టారు. నగర భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఆయన కృషి కీలకంగా నిలిచింది. టెక్నాలజీ వినియోగంలో సీవీ ఆనంద్ ప్రత్యేకంగా గుర్తింపు పొందారు. ఈ-చలాన్ విధానం, స్పీడ్ గన్స్ వంటి వ్యవస్థలను ప్రవేశపెట్టి ట్రాఫిక్ నియంత్రణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అలాగే రివర్సిబుల్ లేన్లు, ఫ్రీ లెఫ్ట్ వంటి విధానాల ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో వినూత్న పరిష్కారాలు అమలు చేశారు.

డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఆధునిక టెక్నాలజీ ఆధారంగా పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కొత్త వ్యూహాలను అమలు చేసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే పోలీసు శాఖలో విశేష అనుభవం కలిగిన సీవీ ఆనంద్ డీజీపీగా బాధ్యతలు చేపట్టడం రాష్ట్ర భద్రతా వ్యవస్థకు బలాన్నిస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన నాయకత్వంలో తెలంగాణ పోలీసు వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.





# కార్మికులకు అండగా సీఎం చంద్రబాబు

➢ మొదటి పేజీ తరువాయి

నెలల్లోనే రూ.63 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని వివరించారు. ఏడాదికి రూ.33 వేల కోట్లు కేవలం పింఛన్లకే కేటాయిస్తున్నామని, దీనిని బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు.పేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా 263 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కార్మిక సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించామని తెలిపారు. నిర్మాణ కార్మికుల వివాహానికి రూ.25 వేల సహాయం, ప్రసూతి సాయం రూ.20 వేలుగా, మరణానికి రూ.60 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం, అమరావతి వంటి ప్రాజెక్టుల ద్వారా కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని తెలిపారు. ప్రజల పక్షానే తాను నిలుస్తానని, వారి ఆశయాల సాధనకే తన కట్టుబాటు ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.తెలంగాణలో కూడా రానున్న రెండు రోజులు వడగాల్పులు కొనసాగుతాయని, మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలని సూచిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మేఘావృత వాతావరణం, స్వల్ప ఈదురుగాలులు కనిపించే అవకాశం ఉన్నప్పటికీ, ఎండ ప్రభావం తగ్గే పరిస్థితి తక్కువగానే ఉందని అధికారులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తాగునీరు ఎక్కువగా తీసుకోవడం, అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లడం, రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు పాటించడం అవసరమని హెచ్చరించారు. ఎండ తీవ్రతను తక్కువగా అంచనా వేయకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

హైదరాబాద్,మే1 అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు.హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్‌వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మేయర్లు, ఛైర్‌పర్సన్లకు అవగాహన

### పట్టణ పరిపాలన, ప్రణాళికలపై రెండ్రోజుల శిక్షణ

హైదరాబాద్,మే1 మహిళాప్రజాప్రతినిధుల నాయకత్వసామర్థ్యాలను పెంపొందించడం, పట్టణ పాలనలో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే దిశగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో రెండ్రోజుల శిక్షణ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, పురపాలక శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో వరంగల్, హైదరాబాద్ రీజియన్స్ పరిధిలోని మహిళా మేయర్స్ ,చైర్‌పర్సన్స్ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరుసగా రెండ్రోజులు పాటు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళాప్రజాప్రతినిధుల నాయకత్వసామర్థ్యాలనుపెంపొందించడం,పట్టణ పాలనలో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే దిశగా మార్గదర్శనం చేయడం లక్ష్యంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెక్రటరీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ టి.కే.శ్రీదేవి పాల్గొని నూతనంగా ఎన్నికైన మహిళలను అభినందించడం తో పాటు వారికి దిశ నిర్దేశం చేశారు . మున్సిపాలిటీల అభివృద్ధిలో చైర్‌పర్సన్స్ మరియు మేయర్స్ పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, పట్టణాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో నాయకత్వ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు.

# తెలంగాణ భవన్‌లో ఘనంగా మేడే వేడుకలు

- బీఆర్‌టీయూ జెండా ఆవిష్కరణ
- కార్మికులతో సమావేశం నిర్వహణ
- సహపంక్తి భోజనంలో కేటీఆర్ పాల్గొనడం






హైదరాబాద్, మే 1 అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ బీఆర్‌టీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికుల సమస్యలు, సంక్షేమ చర్యలపై చర్చ జరిగింది. కార్మికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.మేడే సందర్భంగా కార్మికుల కృషిని గుర్తు చేసుకుంటూ, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో గొప్పదని ఆయన అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కార్మికులు కీలక స్థంభమని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశం అనంతరం కేటీఆర్ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్మికులతో కలిసి కూర్చొని భోజనం చేయడం ద్వారా వారికి తన మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

# ఇక వడివడిగా పోలవరం పూర్తి

2027 జూన్ నాటికి పూర్తయ్యేలా కేంద్రం ప్రణాళిక

తాజాగా మరో రూ.3,300 కోట్ల నిధుల విడుదలకు అంగీకారం

ఢిల్లీలో కేంద్రజలశక్తి కార్యదర్శితో ఎపి సిఎస్ తదితరుల భేటీ

న్యూఢిల్లీ,మే1:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వరప్రదాయిని, జీవనాడి అయిన పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రాజెక్టు నిర్మాణ గడువును 2027 జూన్ నాటికి ఖరారు చేయడంతో పాటు, నిధుల కొరత లేకుండా భారీ కేటాయింపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర జలశక్తి శాఖ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఇప్పటికే రూ.2,300 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం, తాజాగా మరో రూ.3,300 కోట్ల అదనపు నిధుల మంజూరుకు అంగీకరించింది. ఈ నిధులను వచ్చే సెప్టెంబర్ నాటికి విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనివల్ల ప్రాజెక్టు పనులతో పాటు పునరావాస కార్యక్రమాలు వేగవంతం కానున్నాయి.ప్రాజెక్టు పురోగతిపై శుక్రవారం న్యూఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, జల వనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు , ఇతర ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, ఎగువ రాష్ట్రాల అభ్యంతరాలు , ముంపు ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో, 194.6 టీఎంసీల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించేలా తదుపరి కార్యాచరణను కార్యదర్శి కాంతారావు నిర్దేశించారు.

THARANGALU DAILY NEWS
శనివారం, 02 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ప్రవేట్ ఎలక్ట్రీషన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు



**హిందూ ప్రతినిధి మే1,( తరంగాలు):** ఇల్లందు మండలం కరెంట్ ఆఫీస్ సెంటర్ లో ప్రవేట్ ఎలక్ట్రీషన్ ఆధ్వర్యంలో, మేడే 1( ఫస్ట్) కార్మికుల దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రైవేట్ ఎలక్ట్రీషన్స్ అందరు కలిసి తమ సమస్యలను చర్చించుకోవడం జరిగింది. ఏ ఒక్కరికైనా సమస్య వస్తే అందరం కలిసి ఆ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని నిర్ణయించడమైనది. ఈ కార్యక్రమంలో రామ్ కోటి, భూక్య కోటి, బిక్షమయ్య, నరేందర్ రెడ్డి, నరసింహారావు, రామస్వామి, శ్రీకాంత్, సురేష్, శ్రీనివాస రావు, గోపి, శివ, వెంకన్న, కళిం, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉంటూ హక్కులను కాపాడుకోవాలి

**ఎమ్మెల్యే కోరం కనకయ్య**



ఇల్లందు ప్రతినిధి మే1,( తరంగాలు): ఇల్లందు మండలం సుభాష్ నగర్ కూడలిలో ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా, కాంగ్రెస్ అనుబంధం ఆటో, ట్రాలీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొని జెండా ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య ఈ సందర్భంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కార్మికులందరూ ఐక్యతతో కొనసాగుతూ వారి హక్కులను కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కొత్త బస్టాండ్ సెంటర్ లో ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లోనూ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ, వీధి నిర్వహణలో భాగంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోలీసులు సహకరించాలని తెలిపారు. రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్న వాహనదారులు రైతులు అందరి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో, ట్రాలీ ఓనర్స్ వెల్ఫేర్, సర్పంచులు మండల, పట్టణ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను పరిరక్షించాలి

**అమరవీరులకు నివాళులర్పించిన మల్లి బాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు**



**ఇల్లందు ప్రతినిధి మే 1,( తరంగాలు):** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో మేడే వేడుకలు గ్రానైట్, షెల్ఫ్ ల తయారీ, పెయింటింగ్, సుతారి, ఉపాధి హామీ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్,మాజీ పి. ఏ. సి.ఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు మే డే జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ, 140 సంవత్సరాల క్రితం ఇదే రోజున అంటే 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో కార్మికుల హక్కుల కోసం, న్యాయమైన వేతనాల కోసం, రోజుకు8పని గంటలు మాత్రమే ఉండాలని హే మార్కెట్లో జరిగిన శాంతియుత నిరసన కార్యక్రమంలో పెట్టుబడిదారులు జరిపిన కాల్పులు, ఉరిశిక్షల రక్తపాతంలో ఎందరో కార్మికులు అమరవీరులయ్యారని తెలిపారు. ఈ ఉద్యమ ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికులు హక్కుల ను కొంతమేరకు సాధించుకోవడం జరిగిందని, చారిత్రక ఘట్టం జరిగిన ఈ రోజున మేడే జరుపుకోవడం కార్మికుల ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కష్టాన్ని గుర్తించడం, వారి సమస్యలపై అవగాహన కల్పించడం ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశమని, కానీ నేటికీ ప్రైవేట్ రంగాలైన ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రైవేటు వస్త్ర దుకాణాలు, లాంటి తదితర ప్రైవేట్ సంస్థలలో పని చేసే కార్మికులకు శ్రమకు తగిన వేతనం రావడంలేదని, కార్పొరేట్ సంస్థలలో, పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమదోపిడి జరుగుతున్నప్పటికీ, కార్మికుల హక్కులు పరిరక్షించాల్సిన లేబర్ అధికారులు చూసి చూడనట్లుగా ఉండడం దురదృష్టకరమని అన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ శ్రీను, భూక్యా రవి,ధరావత్ ఉపేందర్, భానోత్ నందా, గుగులోతు బావ్ సింగ్, ధరావత్ ద
రాము, గుగులోతు నగేష్, ధరావత్ శివాజీ, భానోత్ మున్నా, బానోత్ రమేష్, ధారావత్ నాగేశ్వరరావు, భూక్య నాగేంద్రబాబు, నాగరాజు, శ్రీను, ఉపేందర్,శంకర్, సాయి,వీరన్న, మాధవ, సతీష్ అనిల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లందులో మే డే సందర్భంగా జెండా ఆవిష్కరణలు






పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన --సిఐటీయు

ఇల్లందు ప్రతినిధి మే 1,( తరంగాలు): ఇల్లందు ఆర్టీసీ డిపో,సింగరేణి కాలరీస్, అంగన్వాడీ ప్రాజెక్ట్, ప్రభుత్వ హాస్పిటల్, ఎండిఓ, ఎంఆర్ఓ, మున్సిపల్ ఆఫీస్, లేబర్ ఆఫీస్,బిల్డింగ్ వర్కర్స్ అడ్డాల పై సిఐటీయు ఆద్వర్యం లో జెండా ఆవిష్కరణలు చేశారు. అనంతరం సీఐటీయు కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమం సీటు మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ, 1886చికాగో అమర వీరుల రక్త తర్పణ సాధించుకున్న హక్కులు చట్టాలను 8గంటల పని విధాన్ని నేటి నరేంద్ర మోడీ సర్కారు 29చట్టాలను రద్దు చేసి 4లేబర్ కోడ్ అమలు చేయడం సరికాదని,దానికి అనుకూలంగా తెలంగాణ ప్రభుత్వం వారానికి 72గంటలు అంటే రోజుకు 12 గంటలు పని చేయాలని జీ ఓ తేవడం, అంటే నరేంద్ర మోదీ తెచ్చిన 4 లేబర్ కోడ్ లను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఉవ్విళ్ళూరుతున్నట్లు ఉందని ఎద్దేవ చేశారు. లేబర్ కోడ్ ల కు వ్యతిరేకంగా పోరాడారని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సుల్తానా,మరియా, ఫాతిమా, దేవేంద్ర, ఐవీలు,అంజన్న, అబ్బాస్,నాగరాజు,మహిమూద్, లక్ష్మణ్ పాసి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి



**వర్ధన్నపేట ప్రతినిధి, మే 1,(తరంగాలు) :** మండల కేంద్రంలోని బండౌతపురం గ్రామానికి చెందిన మరుపట్ల సోమయ్య గురువారం రోజున ఎండ దెబ్బ తగిలి మృతి చెందడం జరిగింది. రోజువారి పనిలో భాగంగా గత శుక్రవారం కూలీ పనికి వెళ్లిన సోమయ్య , తీవ్రమైన ఎండల కారణంగా అస్వస్థతకు గురయ్యాడు. ఇంటికి వచ్చి నిద్రపోయిన సోమయ్య ఎంతటికీ లేవకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని పిలిచి చూడగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణతో కేసముద్రంలో సంచలనం

- సుమారు 6,000 ఫోన్ కాల్స్ టాప్
- జూబ్లీహిల్స్ ఏసీపీ ముందు హాజరైన కాంగ్రెస్ నేత రావుల మురళి



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,మే. 01,(తరంగాలు):గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా, కేసముద్రం మండల కేంద్రం ,మహబూబాబాద్ జిల్లాకు చెందిన కీలక కాంగ్రెస్ నాయకుడు మరియు జిల్లా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) సభ్యుడు రావుల మురళికి జూబ్లీహిల్స్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) నోటీసులు జారిచేయగా శుక్రవారం విచారణాధికారుల ముందు హాజరయ్యారు.కేసు మరియు విచారణలో భాగంగా హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన సి ఆర్ ఎన్ ఓ.243/2024 యూ/ఎస్ 166, 409, 427, 201, 120(బి) ఆర్/ డబ్ల్యు 34 ఐపీసీ మరియు సెక్షన్ 3 ప్రజా ఆస్తి (నష్ట నివారణ) చట్టం 1985 ఢ సెక్ . 65, 66, 70 ఐ టి యాక్ట్ 2000 కేసులో విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఈ విచారణలో భాగంగా, రావుల మురళి శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) కార్యాలయంలో అధికారుల ఎదుట హాజరై,తన వాంగ్మూలాన్ని సమర్పించారు.తెలంగాణ ప్రభుత్వ మాజీ రాజకీయ సలహాదారు, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి ప్రధాన అనుచరుడైన రావుల మురళికి సిట్ (ఎస్పై టి) నోటీసులు జారీ చేయడంతో, ఆయన జూబ్లీహిల్స్ ఏసీపీ పి. వెంకటగిరి నేతృత్వంలోని విచారణ బృందం ఎదుట హాజరై తన వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా రావుల మురళి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..“గత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలోని కీలక నాయకులందరి ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసిందన్నారు. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తో తనకు దశాబ్దాలుగా ఉన్న సన్నిహిత సంబంధం కారణంగా తన ఫోన్ నంబర్‌ను కూడా నిఘా నీడలో ఉంచారనీ తెలిపారు. తన ఫోన్ ద్వారా సుమారు 6 వేల కాల్స్‌ను అధికారులు ట్యాప్ చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. మేము చట్టాన్ని గౌరవిస్తాం,నిజానిజాలను నిగ్గుతేల్చే విచారణ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం,” అని ఆయన స్పష్టం చేశారు.


## డీజీపీ ని మర్యాదపూర్వకంగా కలిసిన రాజనాల శ్రీహరి



**వరంగల్ జిల్లా ప్రతినిధి,మే 1,(తరంగాలు)**
శుక్రవారం రోజు హైదరాబాదులో డీజీపీ కార్యాలయంలో నూతనంగా వచ్చిన డీజీపీ సివి ఆనంద్ ని మర్యాద పూర్వకంగా కలిసి గోల్డ్ పూతతో తయారుచేసిన క్రికెట్ బ్యాటను డీజీపీ కి అందజేసిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి సంజీవరావు, శ్రీనివాస్,బొల్లం మధు పాల్గొన్నారు..

## చౌటపల్లిలో కందాళ ప్రత్యేక పూజలు

- విగ్రహ ప్రతిస్ట, బొడ్రాయి, ధ్వజస్థంభం .
- మహోత్సవానికి హాజరై మాజీ ఎమ్మెల్యే.



**పాలేరు ఆర్సీ, మే 1 (తరంగాలు) :** కూసుమంచి మండలం చౌటపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి, ధ్వజస్తంభం ఏర్పాటు మహోత్సవ కార్యక్రమానికి శుక్రవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, గ్రామంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని భగవంతున్ని కోరినట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఆలయం నిర్మాణానికి సహకరించిన కందాళను మర్యాదపూర్వకంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాపుల కనపర్తి లో ఘనంగా మేడే ఉత్సవాలు




**సంగెం మే 01 తరంగాలు**
కార్మికుల దినోత్సవంను పురస్కరించుకొని మండలంలోని కాపుల కనపర్తి గ్రామంలో చౌరస్తాలో శుక్రవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండాను కార్మిక నాయకుడు సదిరం శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు మాట్లాడుతూ మే డే కార్మికుల ఐక్యతను, కార్మికుల పని దినాలు, వేతనాలను గురించి కలిసికట్టుగా పోరాటం కోసమే కార్మిక సంఘం పనిచేస్తుంది అని అన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు నాయకులు, కార్మిక సంఘం కోశాధికారి రంజిత్, శాతాల సంపత్, సదిరం ఏలియా, మికిరి యాకయ్య, బొమ్మ గాని శీను, పంతంగి కుమారస్వామి, కోళ్ల రాజు, వెల్దండ సాంబయ్య కార్మిక సంఘం అనుబంధ సంఘాలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# దేశ నిర్మాణానికి మూల స్తంభాలు కార్మికులు






### గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

**హనుమకొండ,మే 1, తరంగాలు :** దేశ నిర్మాణానికి కార్మికులు మూల స్తంభాలంటూ గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు.

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కార్మిక ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఉప కార్మిక కమిషనర్ వినీత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన కార్మిక శాఖ కార్యకలాపాల బుక్‌లెట్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. సందర్భంగామేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కోసం గతంలో జరిగిన పోరాటాలను స్మరించుకునే రోజు మే డే అని తెలిపారు. కార్మికుల కృషి ఫలితంగానే నేడు అనేక కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయని అన్నారు. కార్మికుల హక్కులు, భద్రతను కాపాడటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కార్మిక సంక్షేమం కోసం ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, వివాహ సహాయం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని, వారి కృషి వల్లే నగరం పరిశుభ్రంగా నిలుస్తోందని చెప్పారు. కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఉద్యమాల ఫలితంగానే సమాన పనికి సమాన వేతనం వంటి హక్కులు సాధ్యమయ్యాయని అన్నారు. ఐటీఐ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని ఆధునిక సాంకేతికతను అలవరుచుకోవాలని సూచించారు. నైపుణ్యాల ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్మికులు లేకపోతే పరిశ్రమలు నిలిచిపోతాయని, వారి పాత్ర అమూల్యమని అన్నారు.అదనపు కలెక్టర్ ఎన్.రవి మాట్లాడుతూ, కార్మిక ఉద్యమాల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఐటీఐలలో టాటా గ్రూప్ సహకారంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఉప కార్మిక కమిషనర్ వినీత మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి కార్మిక శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పలు సంక్షేమ పథకాల ద్వారా వారికి సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కార్మికులకు బీమా చెక్కులు, ఐటీఐ షార్ట్ టర్మ్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను మేయర్, కలెక్టర్, అదనపు కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, బాయిలర్ విభాగ అధికారి నరేష్, సహాయ కార్మిక అధికారులు వినోద్ కుమార్, చాణక్య, రజిత, ఇతర అధికారులు,ఐటీఐ విద్యార్థులు,కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

**పర్యావరణ,అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**





వరంగల్ ప్రతినిధి, మే 1,తరంగాలు : కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యావరణ,అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం మే డే సందర్భంగా లక్ష్మీపురం మార్కెట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రిగారు జెండా ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కార్మికులకు అండగా ఎల్లప్పుడూ ప్రభుత్వం నిలుస్తుందని, వారికి భీమా ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.అలాగే జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కార్మికులను కోరారు.ఈ కార్యక్రమంలో డిఎంఓ సురేఖ, సంబంధిత అధికారులు, 27వ డివిజన్ కార్పొరేటర్ అనిల్,కార్మిక సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




# సమ్మర్ క్యాంప్‌లు పిల్లల సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరం





### పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**వరంగల్ ప్రతినిధి, మే 1,తరంగాలు** : సమ్మర్ క్యాంప్‌లు పిల్లల సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు .ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఓసిటీ స్టేడియంలో సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఈ తరహా శిక్షణ శిబిరాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు.క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా క్రమశిక్షణ సహనం న్యాయకత్వ లక్షణాలను పెంపొందించే సాధనమని పేర్కొన్నారు 30 వంగని మానై వంగన అనే సామెతలు ప్రస్తావిస్తూ చిన్నప్పటి అలవాట్లను జీవితాంతం ప్రభావితం చేస్తాయని వారు గుర్తు చేశారు.ఈ అవకాశాలను క్రీడాకారులు సద్విని చేసుకొనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారుజిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజా పాలన - - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్‌లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జూడో, క్రికెట్, ఫెన్సింగ్, నెట్‌బాల్ క్రీడలను మంత్రి ప్రారంభించారు. స్టేట్ లెవల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, ఆర్డీవో వరంగల్ సుమ, జిల్లాస్పోర్ట్స్ అధికారి అనిల్, జిల్లా ఒలంపిక్ సెక్రెటరీ కైలాసం యాదవ్, స్పోర్ట్స్ అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# తరచూ రక్త పరీక్షలు చేయించుకుంటన్నా.. కొన్ని వ్యాధులను ముందుగా గుర్తించలేరు.. ఎందుకంటే

ఆరోగ్య పరిరక్షణకు తరచూ రక్తపరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తూ ఉంటారు. తరచూ రక్త పరీక్షలు చాలా కాలంగా ముందస్తు ఆరోగ్య సంరక్షణలో కీలక భాగంగా ఉన్నాయి. ఇవి శరీరంలో ఉన్న సమస్యలను గుర్తించడంలో సహాయపడతాయి. అయితే తాజా వైద్య పరిశోధనలు చెబుతున్నదేమిటంటే, ఈ పరీక్షలు సాధారణంగా వ్యాధి పూర్తిగా అభివృద్ధి చెందిన తర్వాతే గుర్తిస్తాయి గానీ, ప్రారంభ దశ సంకేతాలను చాలాసార్లు గుర్తించలేవు. ప్రతి సంవత్సరం రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలు వంటి సమస్యలను తెలుసుకోవచ్చని చాలా మంది నమ్ముతారు. కానీ వ్యాధి ప్రారంభానికి ముందే శరీరంలో జరిగే సూక్ష్మ మార్పులు, కణ స్థాయి మార్పులు, ఇన్‌ఫ్లమేషన్, మెటబాలిక్ లోపాల వంటివి సాధారణ పరీక్షల్లో బయటపడవు. దీనివల్ల కొంతమంది ఆరోగ్యంగా ఉన్నామనే తప్పుడు నమ్మకంలో ఉండే ప్రమాదం ఉంటుంది.

### రిపోర్టులు నార్మల్‌గా వచ్చినా

వైద్య నిపుణుల ప్రకారం వ్యాధి ప్రారంభ దశలో జెనెటిక్ మార్పులు, గట్ మైక్రోబయోమ్ (మంచి బ్యాక్టీరియా) అసమతుల్యత, తక్కువ స్థాయి ఆక్సిడేటివ్ స్ట్రెస్ వంటి అంశాలు నెమ్మదిగా అభివృద్ధి చెందుతాయి. ఇవి సాధారణ రక్త పరీక్షల పరిమితులను దాటిపోతాయి. అలాగే ఒత్తిడి, నిద్ర లోపం, పర్యావరణ ప్రభావాలు కూడా ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయి. రొటీన్ టెస్టులు ఎందుకు ప్రారంభ దశ వ్యాధులను గుర్తించలేవు అనడానికి వైద్యులు కొన్ని కారణాలు చెబుతున్నారు. ల్యాబ్ నార్మల్ రేంజ్ అనేది సాధారణ జనాభా సగటు ఆధారంగా ఉంటుంది గానీ, అది ఉత్తమ ఆరోగ్య స్థాయిని సూచించదు. అంటే రిపోర్ట్ నార్మల్‌గా వచ్చినా కూడా కొందరికి ప్రమాదం ఉండే అవకాశం ఉంటుంది. అలాగే ఈ పరీక్షలు ఎక్కువగా ఇప్పటికే అభివృద్ధి చెందిన వ్యాధులను మాత్రమే గుర్తిస్తాయి. ఉదాహరణకు ఇన్సులిన్ రెసిస్టెన్స్ లేదా ప్రారంభ ఇన్‌ఫ్లమేషన్ వంటి సమస్యలు ఇంకా స్పష్టంగా బయటపడవు.

### ప్రత్యేక పరీక్షలు అవసరం

కొన్ని వ్యాధులను గుర్తించడానికి ప్రత్యేకమైన పరీక్షలు అవసరం అవుతాయి. గుండె జబ్బులకు అధునాతన లిపిడ్ మార్కర్లు, మధుమేహానికి ఎహెచ్1ఎ వంటి పరీక్షలు మరింత స్పష్టత ఇస్తాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, రక్త పరీక్షలు ఒకే సమయంలో తీసిన స్నాప్‌షాట్ మాత్రమే. ఆ రోజు ఆహారం, ఒత్తిడి, నిద్ర వంటి అంశాలు ఫలితాలపై ప్రభావం చూపిస్తాయి. కాబట్టి ఒకే రిపోర్ట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదు. ప్రారంభ దశలోనే వ్యాధి ప్రమాదాన్ని గుర్తించడానికి వైద్యులు కొన్ని మెరుగైన విధానాలను సూచిస్తున్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తుంటే కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నట్లే.. ఏం చేయాలంటే

ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న అనారోగ్య సమస్యల్లో హై కొలెస్ట్రాల్ సమస్య కూడా ఒకటి. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. హై కొలెస్ట్రాల్ అనేది సాధారణంగా కనిపించేదే అయినప్పటికీ, ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు దానిని హై కొలెస్ట్రాల్ అంటారు. ఇది కణాల నిర్మాణం, హార్మోన్ల తయారీలో అవసరమైన పదార్థమే అయినప్పటికీ, అధికంగా ఉండటం గుండె సంబంధిత వ్యాధులకు కారణమవుతుంది. కొలెస్ట్రాల్‌లో ప్రధానంగా రెండు రకాలు ఉంటాయి. ఎల్డిఎల్ (లో-డెన్సిటీ లిపోప్రోటీన్), దీనిని బ్యాడ్ కొలెస్ట్రాల్ అంటారు, హెచ్డిఎల్ (హై-డెన్సిటీ లిపోప్రోటీన్), దీనిని గుడ్ కొలెస్ట్రాల్ అంటారు. స్థాయిలు పెరిగితే రక్తనాళాల్లో ప్లాక్ పేరుకుపోయి అవి ఇరుకవుతాయి. దీనివల్ల గుండెజబ్బులు, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

### పరోక్ష సంకేతాలు

హై కొలెస్ట్రాల్‌కు ప్రత్యేకంగా కనిపించే లక్షణాలు సాధారణంగా ఉండవు. అందుకే దీనిని సైలెంట్ ప్రాబ్లమ్ గా కూడా పేర్కొంటారు. రక్త పరీక్ష ద్వారానే దీన్ని కచ్చితంగా గుర్తించవచ్చు. అయితే కొన్నిసార్లు పరోక్షంగా కనిపించే కొన్ని సంకేతాలు ఉంటాయి. కొంతమందిలో ఛాతినొప్పి (అంజైనా), శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట వంటి సమస్యలు కనిపిస్తాయి. అలాగే మోచేతులు, మోకాళ్లు లేదా కండరాల దగ్గర పసుపు రంగులో ఉండే కొవ్వు గడ్డలు కనిపించడం, కళ్ల మూలల్లో పసుపు మచ్చలు రావడం, కళ్లలోని ఐరిస్ చుట్టూ తెలుపు లేదా బూడిద రంగు వలయం ఏర్పడటం వంటి లక్షణాలు కూడా ఉంటాయి. అయితే ఇవి నేరుగా హై కొలెస్ట్రాల్ లక్షణాలు కాకుండా, దీని వల్ల కలిగే సమస్యల సూచనలు. ముఖ్యంగా అథెరోస్క్లెరోసిస్ (రక్తనాళాల్లో ప్లాక్ పేరుకుపోవడం) వల్ల రక్తప్రసరణ తగ్గి పలు లక్షణాలు కనిపిస్తాయి.

### తరచూ పరీక్షలు చేయించడం ముఖ్యం

అథెరోస్క్లెరోసిస్ కారణంగా ఛాతిలో ఒత్తిడి లేదా నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కాళ్లలో నొప్పి (నడిచేటప్పుడు కండరాల నొప్పి), చేతులు కాళ్లలో మొద్దుబారటం,